శిక్షణ పొందితేనే లైసెన్స్

- డ్రైవింగ్ స్కూళ్లల్లో ఇక నుంచి హాజరు అమలు
- గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- శిక్షణ పొందే వారికి బయోమెట్రిక్ హాజరు

డ్రైవింగ్ స్కూళ్ల వివరాలు..	
నంద్యాల జిల్లాలో డ్రైవింగ్ స్కూళ్లు	41
ఆర్టీసీ ద్వారా నిర్వహించేవి	1
ప్రైవేట్‌గా నడుస్తున్నవి	32
తరగతులు నిర్వహించే రోజులు	30
ప్రతి ఏటా జారీ చేసే భారీ వాహనాల లైసెన్స్‌లు దాదాపు	1,200


నంద్యాల ఆర్టీసీ ఆధ్వర్యంలో భారీ వాహనాల డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): చేయితడపనిదే పనికాదంటూ ప్రాచుర్యం పొందిన రవాణా శాఖ కార్యాలయాలను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఆర్టీఏకు సంబంధించి ఇప్పటికే దాదాపు 30కి పైగా సేవలు సచివాలయాల ద్వారా అందిస్తోంది. తాజాగా భారీ వాహనాలు నడపడానికి జారీచేసే హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందాలనుకొనే వారికి డ్రైవింగ్ స్కూల్‌లో బయోమెట్రిక్ తప్పనిసరి చేసింది. ఇందుకు సంబంధించి గత ఏడాది నవంబర్‌లో ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేయగా తాజాగా గెజిట్ విడుదల చేసింది. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే ముందుగా ఎల్ఎల్ఆర్ పొంది ఆరు నెలల్లో గుర్తింపు పొందిన డ్రైవింగ్ స్కూళ్ల ద్వారా సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. వారు జారీ చేసిన సర్టిఫికెట్ ద్వారా ఎంవీఐ హోదా కలిగిన అధికారి లైసెన్స్ జారీ చేస్తారు. గతంలో ఈ సర్టిఫికెట్ కోసం డ్రైవింగ్ స్కూల్‌కి రోజూ వెళ్లకపోయినా పని అయిపోయేది. నెల చివరలో వెళ్లి ఒకేసారి 30 రోజుల సంతకాలు చేసేసి, డబ్బు చెల్లిస్తే ట్రైనింగ్ ధ్రువ పత్రం ఇచ్చేవారు. ఈ విధానానికి పూర్తిగా స్వస్తి పలికి నెలరోజుల పాటు రోజూ శిక్షణకు తప్పకుండా హాజరయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉదయం తరగతులు, మధ్యాహ్నం డ్రైవింగ్ పరీక్షలు ఇప్పటికే నిర్వహిస్తుండగా తాజాగా రవాణా శాఖ చట్ట సవరణ చేసింది.

నూతన నిబంధనలు ఇలా..

- శిక్షణ పొందేవారు, ఇన్‌స్ట్రక్టర్లు బయో మెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలి.
- డ్రైవింగ్ స్కూల్‌లో 25 మంది బ్యాచ్‌కు ఒక ఇన్‌స్ట్రక్టర్ ఉండాలి.
- ఇన్‌స్ట్రక్టర్ తప్పనిసరిగా డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్ లేదా డిప్లొమా ఇన్ ఆటో మొబైల్ ఇంజినీరింగ్ లేదా ఐటీఐలో డిజిల్ మెకానిక్ చేసి ఉండాలి.
- ప్రతి డ్రైవింగ్ స్కూల్.. ఫీజు చెల్లింపు, శిక్షణ స్లాట్ బుకింగ్, డ్రైవింగ్ శిక్షణ తదితరాల కోసం ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తీసుకురావాలి.
- రవాణాశాఖ నిర్దేశించిన ఫీజునే వసూలు చేయాలి.
- శిక్షణ పొందే వారికి హాస్టల్ సదుపాయం ఉండాలి. ముఖ్యంగా ప్రతి డ్రైవింగ్ స్కూల్ సొంత ట్రాక్ కలిగి ఉండాలి.

కొత్త మార్పులతో గెజిట్



హెవీ డ్రైవింగ్ లైసెన్స్ జారీ విధానంలో కొత్తగా మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఎంవీఐ స్థాయి అధికారిని డ్రైవింగ్ స్కూల్ పర్యవేక్షణకు నియమించాం. రోజూ అభ్యర్థి తరగతులకు హాజరు కావలసిందే. తరగతికి హాజరైన వారి సంఖ్య ఏరోజుకారోజు ఆన్‌లైన్ ద్వారా సమీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. శిక్షణకు పూర్తిగా హాజరు కావడం ద్వారా డ్రైవింగ్‌లో మెళకువలతో పాటు జాగ్రత్తలపై అవగాహన కలుగుతుంది. నిబంధనలు పాటించని డ్రైవింగ్ స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం.

– శివారెడ్డి, డీటీసీ, నంద్యాల

క్లుప్తంగా

జాబ్ మేళాలో విద్యార్థుల ఎంపిక


ఎంపిక పత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 19 మంది విద్యార్థులు ఎంపిక కాగా ఇంటర్వ్యూ ద్వారా 13 మంది, రాత పరీక్ష ద్వారా ఆరుగురిని ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, జేకేసీ కో ఆర్డినేటర్ పార్వతి, హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి సీమోన్ తెలిపారు. శుక్రవారం ఎంపికైన అభ్యర్థులకు ఎంపిక పత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ కంపెనీ తమ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు 108 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అధ్యాపకులు మోహన్‌రెడ్డి, శ్రీహరి, శ్రీనివాస్, గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ఉయ్యాలవాడ: జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పంచాయతీ రాజ్ ఏఈ రామకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఏఈ మాట్లాడుతూ హరివరం, ఉయ్యాలవాడ గ్రామాల్లో సిమెంట్ రోడ్ల కోసం రూ.15 లక్షల చొప్పున, సర్వాయిపల్లె, బోడెమ్మనూరు, ఇంజేడు, కాకరవాడ, మాయలూరు గ్రామాలకు రూ.5 లక్షల చొప్పున, రూపనగుడి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి రూ. 5 లక్షలు నిధులు మంజూరయ్యాయని ఏఈ వివరించారు.

డీఆర్‌డీఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏర్పాటు


పీడీని కలిసిన సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలోని వైఎస్సార్ క్రాంతి పథం ఎల్–1, ఎల్–2 ఉద్యోగుల నూతనం సంక్షేమ సంఘం ఏర్పాటైందని అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ డీఆర్‌డీఏ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డిని కలిశారు. సమస్యల పరిష్కారం కోసం సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ప్రజలకు ఉత్తమ సేవలందించాలి

నంద్యాల (సిటీ): పట్టణ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఇంజినీర్లు, శానిటేషన్ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో పరిశుభ్రత పరిరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఇంజినీర్లు జయభారతరెడ్డి, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా రామాలయ ముఖ ద్వారం ఏర్పాటు


డి.కొత్తపల్లెలో రామాలయ ముఖద్వారం ఏర్పాటు చేసిన దృశ్యం

చాగలమర్రి: డి.వనిపెంట మజరా డి.కొత్తపల్లె గ్రామంలో రామాలయానికి గ్రామానికి చెందిన ఏరువ పెద్దీశ్వరరెడ్డి, ఏరువ రోసిరెడ్డి, ఏరువ పెద్ద నరసింహారెడ్డి, ఏరువ ప్రతాప్‌రెడ్డి సహకారంతో రూ.3 లక్షలు వెచ్చించి అనంతపద్మనాభ స్వామి, విఘ్నేశ్వరుడు, లక్ష్మీదే వి విగ్రహాలతో ముఖ ద్వారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం దేవస్థానం అర్చకులు వెల్లాల జనార్ధనశర్మ, సంపత్‌శర్మ ఆధ్వర్యంలో రామాలయంలో గణపతిపూజ, అభిషేకం, పుణ్యాహవచనం, నవగ్రహ పూజ, కళశస్థాపన పూజలు నిర్వహించారు. అలాగే అనంత పద్మనాభస్వామికి పంచామృత అభిషేకం, గణపతి హోమం, సుదర్శన హోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, విగ్రహ ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు జరిపించారు.

నేడు రైతులతో ముఖాముఖి

నంద్యాల(సెంట్రల్): కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం గత నెల 6వ తేదీన ఇచ్చిన జీవోతో సీమకు నీటి కష్టాలు తప్పవని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి తెలిపారు. కేంద్రం తెచ్చిన చీకటి చట్టం, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్, ప్రస్తుత కరవు పరిస్థితులపై పట్టణంలోని సమితి కార్యాలయంలో శనివారం రైతులతో ముఖాముఖి నిర్వహిస్తున్నామని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హాజరవుతారన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఐదుగురికి మంజూరైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రూ.6.25లక్షల విలువైన చెక్కులను బాధితులు, కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తూ ఆరోగ్యశ్రీ పథకాన్ని, పథకంలో లేని వ్యాధులకు కూడా చికిత్స చేయించుకొనే ఆర్థిక స్థోమత లేని పేద వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందజేయడం సంతోషకరమన్నారు. పార్టీ పట్టణ రెండవ అధ్యక్షుడు సున్నాశేషయ్య, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డి, నాయకులు కిరణ్, లక్ష్మినారాయణ, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్

నంద్యాల(అర్బన్): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజునాయక్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి జనరంజకమైన పాలనను అందిస్తున్నారన్నారు. శుక్రవారం జరిగిన కేబినెట్ మీటింగ్‌లో కర్నూలుకు కేంద్రియ విశ్వ విద్యాలయం, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, 800 మెగా వాట్ల పవర్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాలో 902 మెగా వాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించడం శుభపరిణామమన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ వైద్యం


వైద్యసేవలందిస్తున్న వైద్యులు

నంద్యాలటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్యం అందుతుందని వైద్యాధికారులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బాలకొండ హాల్ వాసులకు వైద్య పరీక్షలు చేశారు. మొత్తం 532 మందికి వైద్య సేవలందించామని, ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రెఫర్ చేశామని వైద్యాధికారి ప్రియ భావన తెలిపారు.

ఘర్షణ కేసులో జైలు శిక్ష, జరిమానా

నంద్యాల(వ్యవసాయం): ఘర్షణ కేసులో ఐదుగురికి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి శుక్రవారం జైలుశిక్ష, జరిమానా ఖరారు చేసినట్లు కోర్టు లైజనింగ్ ఆఫీసర్ సంజీవరెడ్డి తెలిపారు. వివరాలు.. 2017లో గడివేముల మండలం దుర్వేశి గ్రామానికి చెందిన కౌంటర్ కేసుల్లో మొదటి ఫిర్యాదు దారుడు దామోదర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు.. ఇంటి వద్ద బాత్‌రూమ్ గుంతల విషయంలో గొడవ పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ అనంతరం కోర్టులో హాజరు పరచగా కొడుదుల మన్మోహన్‌రెడ్డికి మూడు సంవత్సరాల జైలుశిక్ష, రూ.11 వేలు జరిమానా, మూలకృష్ణవేణమ్మ, బొమ్మిరెడ్డి చిన్నమ్మకు రూ.వెయ్యి చొప్పిన జరిమానా విధించారు. అదే కేసులో.. మూల కృష్ణవేణమ్మ ఫిర్యాదు మేరకు దామోదర్‌రెడ్డి, గోవిందరెడ్డిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి ఒక్కొక్కరికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.11వేల జరిమానా విధించారని పోలీ సులు తెలిపారు. ఎస్ఐ రామాంజనేయులు, ఏపీపీలు లక్ష్మీనారాయణ, తిరుపతి వాదించారు.

18ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలి


మాట్లాడుతున్న చంద్రనాయక్

నంద్యాల(అర్బన్): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా అవగాహన కల్పించాలని ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ చంద్రనాయక్ కోరారు. స్థానిక నిశాంత్ భవన్‌లో శుక్రవారం ఎస్ఎస్ఆర్–2024 స్పెషల్ క్యాంపైన్ డే సందర్భంగా బీఎల్ఓలు, సచివాలయ వీఆర్ఓలతో ఓట్లలో తప్పు ఒప్పులను సవరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ కాంపైన్‌డే కింద శని, ఆదివారాలతో పాటు డిసెంబర్ 2, 3 తేదీల్లో అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద బీఎల్ఓలు నూతన ఓటరు జాబితాతో హాజరు కావాలని సూచించారు. ఫారం–6, 7, 8, 6బీలను స్వీకరించి కొత్త ఓటరు నమోదుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

మిరప పంట పరిశీలన


పాణ్యం వద్ద మిరప రైతుకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా మిరప పంట పెరుగుదల ఆశించిన మేర లేకపోవటంతో పాటు, తెగుళ్ల ఉధృతి అధికంగా ఉందని జిల్లా ఉద్యానశాఖ అధికారి యూ.నాగరాజు తెలిపారు. రెండ్రోజులుగా ఆయన తన బృందంతో కలిసి జిల్లాలోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, పాణ్యం, మిడుతూరు మండలాల్లో పర్యటిస్తున్నారు. బెట్ట పరిస్థితుల కారణంగా అన్నదాతలు సరైన సమయంలో మిరపలో అంతరకృషి చేయలేకపోయారని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్న పంటల్ని కాపాడుకోవటానికి అనుసరించాల్సిన పద్ధతుల్ని అన్నదాతలకు సమగ్రంగా తెలిపామన్నారు. నీటి ఎద్దడిని తట్టుకుని మొక్క ఎదిగేందుకు యూరియా 10–20 గ్రా./పొటాషియం నైట్రేట్ 2.5–5 గ్రా.లీటరు నీటికి కలిపి వారానికొకసారి పిచికారీ చేయాలని సూచించారు. భూమి మందుల్ని సైతం మొక్క గ్రహించే పరిస్థితి లేనందున స్థూల పోషకాల (19–19–19)5 గ్రా/ లీటరు నీటికి, సూక్ష్మ పోషకాల(అగ్రోమిన్ మాక్స్)–2.5గ్రా./ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే పోషక లోపాన్ని నివారించవచ్చన్నారు.

రుణాలు మాఫీ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి బ్యాంకుల్లో, సొసైటీల్లో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నంద్యాల సమీపంలోని కేసీ కెనాల్ పరివాహక ప్రాంతాల్లో రైతులతో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు 24 లక్షల ఎకరాల్లో పంటలు వేశారని, నీరు ఇవ్వాలన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తెప్పించాలన్నారు. మిరప, పత్తి, జొన్న, మినుము రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం కృష్ణానది జలాలపై పునః సమీక్ష పేరుతో అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కరువు బృందాలను పంపి కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు పాల్గొన్నారు.

జోరుగా శనగ సాగు

- ఇప్పటికే 5,900 హెక్టార్లలో పంట సాగు
- నవంబర్ 15 వరకు విత్తుకు గడువు


పడిగెపాడు వద్ద ట్రాక్టర్‌తో శనగ విత్తనం వేస్తున్న రైతన్న


ఉయ్యాలవాడ సమీపంలో సాగైన పప్పుశనగ పైరు

ఉయ్యాలవాడ : జిల్లాలోనే అత్యధికంగా మండలంలో పప్పు శనగ సాగవుతుంది. సాధారణ సాగు విస్తీర్ణం 17,500 హెక్టార్లు. ఈ ఏడాది మండలంలో వర్షాలు అదునుకు కురవకపోవడంతో సెప్టెంబర్ నెలలో కురిసిన అరకొర వర్షాలకు 5,900 హెక్టార్లలో హరివరం, పడిగెపాడు, ఉయ్యాలవాడ, ఆర్.పాంపల్లె, కొండుపల్లె గ్రామాల్లో మాత్రమే కొందరు రైతులు శనగ పంట సాగు చేశారు. మిగిలిన గ్రామాల్లో ఇప్పటికే పొలాల్లో రసాయనిక ఎరువులు వేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.అయితే ఈ నెల 2వ తేదీ నుంచి మేఘావృతం అవుతుండటంతో రైతులు ఆశగా మేఘాల వంక చూస్తున్నారు. పైగా ఈశాన్య రుతు పవనాల ప్రభావంతో ఈ నెల 5వ తేదీ నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించడంతో రైతుల్లో ఆశాభావంతో ఉన్నారు. వర్షాధార పంట కావడంతో వర్షం వస్తే ఈ నెల 15వ తేదీ వరకు విత్తనం వేసుకునేందుకు అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు.

విషపు ఎరతో కత్తెర పురుగు నివారణ

నంద్యాల(అర్బన్): తవుడు, బెల్లంతో పాటు ఏదైనా పురుగు మందుతో విషపు ఎరను గుళికల రూపంలో తయారు చేసి మొక్కజొన్న పంటలో చల్లి కత్తెర పురుగును నివారించుకోవచ్చని నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో 1,100 హెక్టార్లలో సాగు చేసిన జొన్న పంటకు అక్కడక్కడా కత్తెర పురుగు ఆశించిందని, నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంట పరిశీలనలో భాగంగా శుక్రవారం మండలంలోని చాపిరేవుల గ్రామ పొలాల్లో జొన్న పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎకరాకు 8–10 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి పురుగు ఉధృతిని గమనించాలన్నారు. పురుగు అధికంగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5గ్రాములు లీటరు నీటికి లేదా లాండాసైహాలోత్రిన్ ఒక మి.లీ లీటరు నీటిని కలిపి పిచికారీ చేస్తే ఫలితాలు ఉంటాయన్నారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న కాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం తదితర పూజల అనంతరం వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి, ఒడి బియ్యం కార్యక్రమాన్ని చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవ విధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ లక్ష్మీనారాయణ, అరవేటి వాసు, విజయ్‌కుమార్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రి, తిమ్మయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి న్యాయవాదుల విధుల బహిష్కరణ


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జయకృష్ణ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా కోర్టులో శనివారం నుంచి న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోళ్ల జయకృష్ణ, ప్రతాపరెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెంచిన రూ.20 వెల్ఫేర్ స్టాంప్‌లను ప్రతి పిటీషన్‌కు వేయాలని ఏపీ బార్ అసోసియేషన్ తీర్మానించిందని, ఈ తీర్మానం న్యాయవాదులకు భారంగా మారుతుందన్నారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా నేటి నుంచి 11వ తేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బొల్లెద్దుల రవి, ఎస్ఎన్ ఖాద్రి, రాజేశ్వరి, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత


వెంకటరామయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ అక్బర్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణానికి చెందిన వృద్ధుడు అనారోగ్యం కారణంగా కర్నూలు పట్టణంలో చికిత్స పొందుతుండగా వలంటీర్ శుక్రవారం అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశాడు. పట్టణంలోని ఎస్బీఐ కాలనీ సుంకులమ్మ వీధిలో నివాసముంటున్న ఇమ్మడి వెంకటరామయ్య వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఇటీవల రామయ్యకు కిడ్నీలకు సంబంధించిన వ్యాధి సోకింది. చికిత్స కోసం గత నెల 15న కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. అక్కడ గత నెల 25న శస్త్రచికిత్స చేసిన వైద్యులు తమకు అందుబాటులో ఉండాలని సూచించటంతో రామయ్య అక్కడే ఉన్న తన చిన్న కుమారుడి ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల ఒకటో తేదీ పింఛన్ అందించేందుకు 16వ వార్డు వలంటీర్ అక్బర్ రామయ్య ఇంటికి వెళ్లాడు. విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

నంద్యాల(న్యూటౌన్): రోడ్డు భద్రతా నియమాలపై రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతిరాం మెడికల్ కాలేజీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ తదితర అంశాలను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. రాత్రి వేళల్లో వాహనం నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.సెల్‌ఫోన్ డ్రైవింగ్, సీట్ బెల్ట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపడం, ద్విచక్రవాహనాలపై ముగ్గురు లేదా నలుగురు వెళ్లడం, ఓవర్ స్పీడ్ తదితర అంశాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. రవాణా శాఖ అధికారులు శ్రీకాంత్, రవిశంకర్‌నాయక్, తిమ్మరుసు నాయుడు, క్రాంతి కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఇన్‌స్పెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

అవి-ఇవి

వార్డు సచివాలయం తనిఖీ

నంద్యాల (సిటీ): స్థానిక 35వ వార్డు సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలదించాలని సూచించారు. స్పందన కార్యక్రమానికి వస్తున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విధుల్లో అలసత్వం వహించరాదని, అప్రమత్తంగా ఉంటూ, ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

గోస్పాడు: గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. పథకాలపై అవగాహన కల్పించి అర్హులైన ప్రజలకు పథకాలు లబ్ధి చేకూరేలా చూడాలని తెలిపారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో శుక్రవారం షష్టిని పురస్కరించుకుని ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం వివిధ పండ్ల రసాలతో అభిషేకం జరిపించారు.

వైభవంగా పల్లకోత్సవం

మహానంది: శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్యశర్మ తదితరులు స్వామి,అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. అనంతరం నాలుగు దిక్కుల్లో బలిహరణ, నందీశ్వర పూజలు చేసి ఆలయ ప్రాకారాల్లో పల్లకీత్సవం జరిపించారు.


క్రిష్టిపాడు శివారులో గిజగాళ్లు నిర్మించుకున్న గూళ్లు

ఇంజినీర్ బర్డ్..

గిజిగాడు.. ఓ చిన్న పక్షి. కానీ అద్భుతంగా తన గూడును నిర్మించుకుంటుంది. ప్రకృతిలో లభించే చెట్ల బెరడును చీల్చి వాటి పోగులు, జంతువుల వెంట్రుకలతో తన గూటిని పటిష్టంగా ఏర్పాటు చేసుకుంటుంది. మగ జాతి పక్షి 18 రోజుల్లో గూడును నిర్మించుకుంటుందట. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఇలా గూళ్లను నిర్మించుకుంటాయి. శత్రువుల నుంచి కాపాడుకునేందుకు ఎత్తైన, చెట్ల కింద నీరుండేలా చూసుకుంటాయట. మండలంలోని క్రిష్టిపాడు గ్రామ శివారులోని కల్లాల్లో ఉన్న తుమ్మ చెట్లకు ఇలా కొన్ని పిచ్చుకలు ఇలా గూళ్లను నిర్మించుకొని సంతానోత్పత్తికి శ్రీకారం చుట్టాయి. – దొర్నిపాడు


తల్లి తెచ్చే ఆహారం కోసం గూటిలో నుంచి కేకలు వేస్తున్న పిల్ల పక్షి